మురుగు సమస్యతో ప్రజల అవస్థలు

ఎన్నిసార్లు మరమ్మతులు చేసినా తీరని సమస్య

షాపూర్‌నగర్, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంతవాసులను డ్రైనేజీ సమస్య ఇబ్బందులకు గురిచేస్తోంది. ఈ సమస్యపై అధికారులకు ఎన్నిమార్లు విన్నవించినా సమస్యను పెడ చెవిన పెడుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గాజులరామారం, మెట్‌కానీగూడకు వెళ్లే రోడ్డులో నిత్యం డ్రైనేజీ పొంగి రోడ్లపై పారుతోంది. దీంతో ఈ రోడ్డుపై నడవలేని పరిస్థితి. పక్కనే పక్కనే దేవాలయం ఉండడంతో గుడికి వచ్చే భక్తులు, ఈ రహదారిన వెళ్లాల్సి వస్తోంది. రోడ్డంతా మురుగునీరు ఉండడంతో భక్తులు అవస్థలు పడుతున్నారు. తూతూ మంత్రంగా మరమ్మతులు చేస్తున్నా మళ్లీ సమస్య మొదలవుతోంది. అధికారులు స్పందించి డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.



గుడివద్ద ఏరులై పారుతున్న మురుగునీరు

శాశ్వత పరిష్కారం చూపాలి

జీడిమెట్ల: సూరారం కాలనీ రాంలీలా మైదానం దగ్గర రోడ్డుపై నిత్యం మురుగునీరు ప్రవహిస్తోందని సుభాష్‌నగర్ డివిజన్ బీజేపీ నాయకులు మంగళవారం జలమండలి జీఎం అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మురుగునీరు రహదారిపై చేరడంతో ఆ ప్రాంతమంతా చెరువును తలపిస్తోంది. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. కానీ డ్రైనేజీ లీకైనప్పుడల్లా కంటితుడుపు చర్యలు చేపడుతూ ప్రజాధనం వృథా చేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడి ఇబ్బందులు పడుతుంటే అధికారులు డ్రైనేజీ విషయంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంది శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు సత్యనారాయణ రాజు, విఘ్నేష్, విజయేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

డివిజన్ సమస్యలపై కార్పొరేటర్ సమీక్ష

మియాపూర్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ డివిజన్‌లోని పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అధికారులను కోరారు. మంగళవారం ఆయన మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డివిజన్‌లోని సమస్యలు, అభివృద్ధి పనులపై జీహెచ్ఎంసీ అధికారులతో సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో పలు కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న సీసీరోడ్లను త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలన్నారు. పనులు జరిగే సమయంలో స్థానికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఈఈ రాజు, డీఈ స్రవంతి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీకాంత్



వృథాగా పోతున్న తాగునీరు

ఉషాముళ్లపూడి రోడ్‌లో తాగునీరు లీకేజీ

హైదర్‌నగర్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఉషాముళ్లపూడి రోడ్ ప్రధాన రహదారిలో తాగునీటి పైపులైను పగిలి భారీగా తాగునీరు వృథాగా పోతోంది. డ్రైనేజీ నిర్మాణం సమయంలో జేసీబీతో పనులు చేస్తుండగా తాగునీటి పైపులైను పగిలిపోయింది. విజయనగర్‌కాలనీ, నవోదయకాలనీతో పాటు పలు ప్రాంతాలకు వెళ్లే తాగునీరు లీకై పెద్దఎత్తున వృథాగా పోయింది. ఈ విషయమై భాగ్యనగర్ సెక్షన్ జలమండలి మేనేజర్ ప్రశాంతిని వివరణ కోరగా పనులు జరిగే సమయంలో కాంట్రాక్టర్లు జాగ్రత్తగా చేయాలని, జలమండలి సిబ్బందిని ఏర్పాటు చేశామని, అయినా సదరు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా పనులు చేయడంతో పైపులైను పగిలిపోయిందని తెలిపారు. వీలైనంత త్వరగా మరమ్మతులు చేసి ప్రజలకు తాగునీరు అందిస్తామన్నారు.

గోదావరి నీళ్లు నేలపాలు

పేట్‌బషీరాబాద్: గోదావరి నీళ్లు నేలపాలవుతోందని జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని జీడిమెట్ల డివిజన్‌లోని బజరంగ హిల్స్ కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కాలనీలకు నీరు విడుదల చేసినపుడల్లా తాగునీరు రోడ్డుపాలు అవుతోందని, ఇలా నెలరోజుల నుంచి లీక్ అవుతుందని సెక్షన్ మేనేజర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. తాగునీరు వృథా కాకుండా సక్రమంగా సరఫరా జరిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



విశ్వహిందూ పరిషత్ వేడుకల్లో పాల్గొన్న వీహెచ్‌పీ నేతలు

విశ్వహిందూ పరిషత్ వార్షిక వేడుకలు

కేపీహెచ్‌బీకాలనీ: వీహెచ్‌పీ వార్షిక వేడుకలకు మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే రాజాసింగ్ హాజరయ్యారు. మూసాపేట్‌లో సోమవారం రాత్రి నిర్వహించిన ఈ వేడుకల్లో మంత్రి మాట్లాడుతూ.. యువతను సనాతనమైన ధర్మంవైపు తీసుకెళ్తున్న వీహెచ్‌పీని మంత్రి అభినందనించారు. కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ తదితరులు పాల్గొన్నారు. మూసాపేట్ నుంచి కూకట్‌పల్లి వరకు ర్యాలీ నిర్వహించారు.



క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న ఏడీసీపీ సత్యనారాయణ

యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించాలి

నిజాంపేట్, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): పోలీస్ ఉన్నతాధికారుల సూచన మేరకు కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు అందరూ తమవంతు సహకరించాలని బాలానగర్, కూకట్‌పల్లి డివిజన్‌ల ఏడీసీపీ సత్యనారాయణ అన్నారు. బాచుపల్లిలోని జీఆర్‌ఐటీలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న బాలానగర్ పోలీసుల జోనల్ స్థాయి వాలీబాల్ క్రీడలను ఏడీసీపీ మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు, అదే విధంగా డ్రగ్స్ బారిన పడకుండా యువతను ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడిపేందుకు తమవంతుగా ఇలాంటి క్రీడలు నిర్వహిస్తుననట్లు తెలిపారు. ఈ క్రీడల్లో 8 పీఎస్‌ల నుంచి 40 బృందాలు పాల్గొననున్నట్లు తెలిపారు. క్రీడల ప్రారంభంలో బాలానగర్, కూకట్‌పల్లి ఏసీపీలు హన్మంతరావు, శ్రీనివాసరావు,బాచుపల్లి సీఐ ఉపేందర్ పాల్గొన్నారు.

వినాయక మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదు

పేట్‌బషీరాబాద్,ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపనకు ముందు పోలీసులకు సమాచారం అందించాలని మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. మంగళవారం పేట్‌బషీరాబాద్‌లోని ఎస్‌పీజీ గ్రాండ్ హోటల్‌లో మేడ్చల్ జోన్ పరిధిలోని రెవెన్యూ, జీహెచ్ఎంసీ, నీటిపారుదలశాఖ, విద్యుత్‌శాఖ ఏడు పోలీస్‌స్టేషన్‌ల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొమ్మిది రోజులు నిర్వాహకులు గణేశ్ మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని, మండప ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలని, కార్యక్రమంలో ఏసీపీలు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాములు, సిఐలు విజయవర్ధన్, శ్రీనాద్, భరత్‌కుమార్, సతీష్, కొంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, దుండిగల్, గండి మైసమ్మ తహశీల్దార్ మతిన్, అధికారులు పాల్గొన్నారు.

నిమజ్జనం వివరాలు పోలీసులకు తెలపాలి

బాలానగర్: వినాయకచవితి వేడుకలను ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా జరుపుకోవాలని బాలానగర్ ఏసీపీ హనుమంతరావు మండప నిర్వాహకులకు సూచించారు. బాలానగర్ సీఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో బాలానగర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ మీటింగ్‌లో మండప నిర్వాహకులకు ఏసీపీ, సీఐలు పలు సూచనలు చేశారు. మండపాలు ఎవరు ఏర్పాటు చేస్తున్నారు. నిమజ్జనం ఎప్పుడు చేస్తారు వివరాలు పోలీసులకు తెలియజేయాలన్నారు.



ఆర్టీసీ డిపో ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ కార్మికులు

ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలి

ఫతేనగర్, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని కూకట్‌పల్లి ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. తెలంగాణ ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులంతా నల్లబ్యాడ్జిలు ధరించి డిపో గేటు ఎదుట మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ.. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించాలని కోరారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): పోస్టాఫీస్‌లో అమలు చేస్తున్న పొదుపు పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని తపాలశాఖ సికింద్రాబాద్ డివిజన్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం జీడిమెట్ల డివిజన్‌లోని ఎంఎన్‌రెడ్డినగర్ కమ్యూనిటీహాల్లో తపాలశాఖ ఏర్పాటుచేసి డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగామ్‌కు ఆయన, ఆ శాఖ సికింద్రాబాద్ డివిజన్ సహాయ సూపరింటెండెంట్ సంపత్‌రెడ్డి, మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి భరత్‌సింహారెడ్డి, ఎంఎన్‌రెడ్డినగర్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి హాజరై ప్రసంగించారు.

తాగునీటి కోసం మున్సిపల్ కార్యాలయం ముట్టడి

దుండిగల్, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ మండల పరిషత్ మున్సిపల్ కార్యాలయానికి ముందు ఉన్న డబుల్ బెడ్‌రూంలోని వారికి తాగునీటి సమస్య ఉందని డబుల్ బెడ్‌రూంవాసులు దుండిగల్ మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న వాటర్ వర్క్స్ కార్యాలయాన్ని మంగళవారం ముట్టడించారు. గత ప్రభుత్వం దుమ్మరిపోచంపల్లిలో 16 వందల డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించారని, అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రారంభించి కనీస సదుపాయాలు కల్పించడం మరిచిపోయారని వాపోయారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో ముఖ్యమంగా తాగునీటి సౌకర్యం లేకపోవ డంతో కార్యాలయాన్ని ముట్టడించి అధికారులకు తమ సమస్యను విన్నవిచారు.



మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించిన డబుల్ బెడ్‌రూంవాసులు



స్వామి వారి పల్లకీ సేవలో పాల్గొన్నభక్తులు

సందడిగా ముగిసిన కృష్ణాష్టమి వేడుకలు

ఫతేనగర్, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): ఫతేనగర్ డివిజన్‌కు చెందిన త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందు జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆల్విన్ సొసైటీలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో చిన్నారులు రాధాకృష్ణుడి వేషధారణలతో సందడి చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు, శ్రీకృష్ణభగవానుడి నామస్మరణలతో పరిసర ప్రాంతాలు మారుమోగిపోయాయి. జై కృష్ణా అంటూ జ్ఞాన వేదిక సభ్యుల ఆధ్వర్యంలో చేపట్టిన కృష్ణభగవానుడి పల్లకీ సేవలో పుర ప్రముఖులందరు పాల్గొని స్వామి వారిని భుజాన మోశారు.

అక్రమంగా షెడ్డు నిర్మాణంపై ఫిర్యాదు

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి) : జీడిమెట్ల డివిజన్‌లో ఓ వ్యక్తి అక్రమంగా షెడ్డు నిర్మిస్తున్నాడు. పేట్‌బషీరాబాద్‌లో నిర్మాణం చేపడుతున్న షెడ్డు గురించి స్థానికులు సోషల్ మీడియా ద్వారా గ్రేటర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. నిర్మాణాలపై అధికారులు పట్టించుకోకపోవడంతోనే విచ్చలవిడిగా నిర్మాణాలు వెలుస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అనుమతి లేని షెడ్లపై చర్యలు తీసుకోవాలని కోరారు.



అక్రమంగా వెలుస్తున్న షెడ్డు

వాహనం ఢీకొని యువకుడి మృతి

జీడిమెట్ల, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): స్కూటీపై విధులకు వెళ్తున్న ఇద్దరు యువకులను వెనుక నుంచి అతివేగంగా వచ్చిన వాహనం ఢీకొట్టడంతో ఓ యువకుడు తీవ్రగాయాల పాలై మృతి చెందాడు. మరో యువకుడు గాయపడడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. జీడిమెట్ల సీఐ మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాల్‌పల్లి, రాయగొండ మండలం, రామగుండాలపల్లికి చెందిన జయేందర్‌రెడ్డి కుటుంబం చింతల్ మాణిక్యనగర్‌లో నివాసముంటోంది. అతడి కుమారుడు ముల్లగుండ్ల నాగేందర్ రెడ్డి (31) జీడిమెట్ల దూలపల్లి ప్రాంతంలోని అరుణోదయా ప్రింటింగ్ ప్రెస్‌లో పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం 8.30 గంటల సమయంలో నాగేందర్‌రెడ్డి, అతని చిన్నమ్మ కుమారుడు జితేందర్‌రెడ్డి కలిసి స్కూటీపై విధులకు హాజరు కావడానికి దూలపల్లికి వెళ్తున్నాడు. సుభాష్‌నగర్ సాయికాంటా వద్దకు రాగానే వెనుక నుంచి అతివేగంగా వచ్చిన వాహనం వీరు ప్రయాణిస్తున్న స్కూటీని ఢీకొట్టింది. ఈ ఘటనలో వాహనం నాగేందర్‌రెడ్డిపై నుంచి వెళ్లింది. వెనుక కూర్చున్న జితేందర్‌రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. వీరిద్దని ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యలోనే నాగేందర్‌రెడ్డి మృతి చెందాడు. జితేందర్‌రెడ్డి చికిత్స పొందుతున్నాడు. బాధిత కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.



మృతి చెందిన నాగేందర్‌రెడ్డి

హామీల అమలులో బీఎంఎస్ నేతలు విఫలం

బాలానగర్, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో గెలిచిన బీఎంఎస్ యూనియన్ నాయకులు కార్మికులకు ఇచ్చిన హామీలు, వాగ్దానాలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని బాలానగర్ హిందుస్తాన్ ఏరోనాటికల్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్) వర్కర్స్ యూనియన్ కూటమి నాయకులు మండిపడ్డారు. ఈనెల 30న జరుగనున్న కార్మిక ఎన్నికల్లో భాగంగా మంగళవారం హెచ్‌ఏఎల్ సౌత్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో కూటమి నాయకులు ప్రసంగించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు వెంకటాద్రి, గౌరవ అధ్యక్షుడు విజయప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ కర్క నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌బాబు బీఎంఎస్ తీరును ఎండట్టారు. బీఎంఎస్ అధికారంలో ఉన్న 2 ఏండ్ల 10 నెలల్లో కాలక్షేపం తప్పా.. కార్మికులకు చేసిందేమీ లేదన్నారు. మళ్లీ ఎన్నికలు రాగానే ఏం ముఖం పెట్టుకుని కార్మికులను ఓట్లు అడగడానికి వచ్చారో అంతుచిక్కడం లేదన్నారు. ఈనెల 30న జరిగే కార్మిక యూనియన్ ఎన్నికల్లో కాగడ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని వారు కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఈ గేట్ మీటింగ్‌లో బీఎస్.సుదర్శన్, సుబ్రహ్మణ్యం, గణేష్, సబ్గతుల్లా, ప్రవీణ్, చందర్‌రావు నాయక్, సురేశ్, రాంచందర్, వెంకటపతి, అన్వర్, సునీత, లత, నీలవేణి, బాబీ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌ఏఎల్ గేట్ మీటింగ్‌లో వర్కర్స్ యూనియన్ కూటమి నాయకులు

ఆశా వర్కర్లకు ముగిసిన శిక్షణ శిబిరం

గచ్చిబౌలి, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లు విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధులపై మూడు రోజులుగా శిక్షణ తరగతులు లింగంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు. మంగళవారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా డీఎం అండ్ హెచ్‌ఓ వెంకటేశ్వరరావు, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ విజయపూర్ణిమ పాల్గొని ఆశా వర్కర్లు చేయాల్సిన పనులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ శిక్షణ తరగతులు ఆశా వర్కర్లు నేర్చుకున్న విషయాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. మండలం పరిధిలో ఆశా వర్కర్లకు కేటాయించిన ఏరియాలో గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. ఆ మహిళ సుఖవంతమైన ప్రసవం జరిగేందుకు ఆస్కారం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి వారం ఆస్పత్రికి తీసుకువచ్చి వైద్యపరీక్షలు, బిడ్డ ఎదుగుదలను తల్లికి తెలియచేయాలని సూచించారు. శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా ఆశా వర్కర్లకు పరీక్ష నిర్వహించారు. మెరుగైన ఫలితాలు సాధించిన ఆశా వర్కర్లకు బహుమతులు అందజేశారు. అనంతరం వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి మండల వైద్యాధికారి డాక్టర్ అన్నపూర్ణ, సీహెచ్‌ఓ స్వామి, సుమారు 46 మంది ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



ఆశావర్కర్లకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న డీఎం అండ్ హెచ్‌ఓ వెంకటేశ్వరరావు

కంపుకొడుతున్న వినాయక నిమజ్జనాల కొలన్లు

గచ్చిబౌలి, (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జనాల నీటికొలనులు దుర్గంధభరితంగా మారాయి. నిర్వహణ లేక నీటికొలనుల్లో చెత్తాచెదారం చేరింది. అధికారులు కొలన్లు ఏర్పాటులో ఉన్న శ్రద్ధ నిర్వహణలో లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొలన్లు పూర్తిగా చెత్తాచెదారం నిండిపోయి దుర్గంధభరితంగామారాయి. ప్రతియేటా వినాయకచవితికి ముందే వీటిని శుభ్రం చేసేవారు. లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన నీటి కొలన్లను అధికారులు నిరంతరం శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి

గచ్చిబౌలి, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో పారిశుధ్య పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. సర్కిల్ కార్యాలయానికి నూతనంగా వచ్చిన ముగ్గురు జీహెచ్ఎంసీ అధికారులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి శుభాకాంక్షలు తెలిపారు. సర్కిల్ ఏఎంహెచ్‌ఓగా శ్రీకాంత్‌రెడ్డి, ఎస్ఎఫ్‌లు, ఎస్ఆర్‌పీలు పారిశుధ్య కార్మికుల మధ్య సమన్వయంతో పనులు చేయాలని తెలిపారు. కాలనీల్లో పేరుకుపోయిన చెత్తకుప్పలు తొలగించాలని, రాంకీ, జీహెచ్ఎంసీ సిబ్బంది మధ్య సమన్వయ లోపంతో చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయని గాంధీ సూచించారు. పారిశుధ్య పనుల నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలని ఏఎంహెచ్‌ఓగా పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుపై కోర్‌కమిటీ సమావేశం

గచ్చిబౌలి, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని శేరిలింగంపల్లి పార్టీ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ నాయకులకు సూచించారు. మంగళవారం కొండాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదుపై కోర్‌కమిటీ సమావేశం నిర్వహించారు. సభ్యత్వ నమోదు మహాయజ్ఞంలా చేపట్టాలని సూచించారు. డివిజన్ల వారీగా ఇన్‌చార్జిలు, కో-ఆర్డినేటర్లను నియమించి సభ్యత్వ నమోదు చేయాలని తీర్మానించినట్లు రవికుమార్‌యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్‌రావు, అశోక్, రాఘవేందర్‌రావు, నరేందర్‌రెడ్డి, మణిభూషణ్, మహిపాల్‌రెడ్డి, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

DOCUMENT LOST

My Name V.Rama Rao S/o V.Janardhana Rao R/o. Banjara Hills. **I Lost my Original Document No. 7327/1983.** While Travelling from Ayyappa Society, Madhapur. If anybody found Please **Contact: 99492 39494**

సెప్టెంబర్ 26 నుంచి ఇన్వెస్టర్ కనెక్ట్ వర్క్‌షాప్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్, ఇంటర్నేషనల్ స్టార్టప్ నెట్‌వర్క్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐఎస్ఎన్)తో కలిసి అంతర్జాతీయ స్టార్టప్ ఫెస్టివల్ (ఐఎస్ఎఫ్) 2024ను హైదరాబాద్‌లో తొలిసారి నిర్వహించేందుకు సిద్ధమైంది. సెప్టెంబర్ 26 నుంచి 28 వరకు గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో దీనిని నిర్వహించనున్నారు. ఐఎస్ఎఫ్ 2024 కోసం ఇన్వెస్టర్ కనెక్ట్ వర్క్‌షాప్, కర్టెన్ రైజర్ కార్యక్రమం మంగళవారం టీ-హబ్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో ఐఎస్ఎఫ్ ఫౌండర్ జేపీ చౌదరి, ఐఎస్ఎఫ్ నెట్‌వర్క్ డైరెక్టర్ డాక్టర్ శివమహేష్ టంగుటూరు, ఫిక్కీ ఫ్లో చైర్‌పర్సన్ ప్రియాగజ్దర్ పాల్గొన్నారు. ఐఎస్ఎఫ్ 2024ను 'ఏఐ యుగంలో ఆవిష్కరణ, వ్యవస్థాపకత' నేపథ్యంతో హెల్త్‌కేర్, ఎడ్యుకేషన్, అగ్రిటెక్, ఫుడ్ టెక్నాలజీ, ఫిన్‌టెక్, రూరల్ ఇన్నోవేషన్స్‌తో సహా వివిధ రంగాలలో ఆవిష్కరణలను చేయడానికి కృత్రిమ మేధస్సుపై దృష్టి సారించి నిర్వహించనున్నామని జేపీ చౌదరి అన్నారు. ఐఎస్ఎఫ్ నెట్‌వర్క్ డైరెక్టర్ డాక్టర్ శివమహేష్ టంగుటూరు మాట్లాడుతూ 'ఐఎస్ఎఫ్ 2024లో ఇండియా, యూఎస్ఏ తదితర దేశాల నుంచి స్టార్టప్‌లు పాల్గొంటాయని తెలిపారు.



కార్యక్రమంలో బ్రోచర్‌ను విడుదల చేస్తున్న సంస్థ ప్రతినిధులు

తెలుగు రాష్ట్రాలు గర్వించతగ్గ వ్యక్తి చంద్రబాబు

● విశ్రాంత న్యాయమూర్తి భవానీప్రసాద్

బంజారాహిల్స్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలు గర్వించదగ్గ వ్యక్తి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జి.భవానీప్రసాద్ అన్నారు. వ్యవసాయం, సాంకేతిక పరిజ్ఞానం ఇలా ప్రతీ రంగంలో ప్రగతి సాధించేందుకు ఆయన తీవ్రంగా శ్రమించారని, శ్రమిస్తున్నారన్నారు. పాత్రికేయుడు రచించిన చంద్రబాబు ఎక్స్ పాయింట్ ఎక్స్‌ఓ పుస్తకాన్ని ఫిలింనగర్ కల్చరల్ క్లబ్‌లో మంగళవారం ఏపీ రెరా మాజీ చైర్మన్ డాక్టర్ రామనాథ్ వెలమటి, మదనపల్లి ఎమ్మెల్యే మహ్మద్ షాజహాన్ బాషాతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం జస్టిస్ భవానీప్రసాద్ మాట్లాడుతూ రచయిత రాజకీయ వివాదాల జోలికి వెళ్లకుండా కేవలం చంద్రబాబునాయుడు ఆలోచనా విధానం, అభివృద్ధి విషయంలో విజన్‌ను మాత్రమే ప్రస్తావించడం అభినందించదగ్గ విషయమన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాకముందు టీడీపీలో జరిగిన పరిణామాల తాలూకు జాడ తన పాలనలో ఉండకుండా కేవలం ఎన్టీఆర్ ఆశయాలను అమలు చేసేందుకు మాత్రమే బాబు కష్టపడుతున్నారన్న విషయం ప్రస్తుత పాలన తీరును చూస్తేనే అర్థమవుతుందన్నారు. 1995లో తొలిసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబు అనాటి న్యాయశాఖలో సమూల మార్పులు తీసుకువచ్చేందుకు శ్రీకారం చుట్టారన్నారు. ఇందుకోసం ఆయన ఎందరో న్యాయమూర్తుల సలహాలు, సూచనలు తీసుకున్నారని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తి ఆలోచన గురించి పుస్తకం రావడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. ఏపీ రెరా మాజీ చైర్మన్ డాక్టర్ రామనాథ్ వెలమటి మాట్లాడుతూ ఓవైపు వ్యవసాయంపై దృష్టి పెడుతూ మరోవైపు ఇన్ఫ్రాస్ట్రక్చర్‌ను ఎలా అభివృద్ధి చేయాలి.. భవిష్యత్తులో తలెత్తే ముప్పును ఎలా ఎదుర్కోవాలనే విజన్‌తో పనిచేయడం కేవలం చంద్రబాబునాయుడికే సాధ్యమన్నారు. ఎమ్మెల్యే మహ్మద్ షాజహాన్ బాషా మాట్లాడుతూ ఏపీ సీఎం చంద్రబాబునాయుడితో సుదీర్ఘంగా పనిచేసిన అనుభవం తనకు ఉందన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్, నెక్స్‌టెల్ మెట సీఈఓ మిక్కిలినేని శ్రీకాంత్, రాష్ట్ర టీడీపీ మహిళా విభాగం నాయకురాలు భవనం షకీలారెడ్డి, పాల్గొన్నారు.



చంద్రబాబునాయుడు ఎక్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విశ్రాంత న్యాయమూర్తి భవానీప్రసాద్, ఎమ్మెల్యే మహ్మద్ షాజహాన్‌బాషా

జైషాకు జగన్ అభినందన

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఐసీసీ నూతన చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన జైషాను హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ తరపున ఆ సంఘం అధ్యక్షుడు జగన్మోహన్ రావు అభినందించారు. జైషా నాయకత్వంలో క్రికెట్ మరింత అభివృద్ధి చెందనుందని అభిప్రాయపడ్డారు. కొత్త బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి బీసీసీఐకి, దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు.



జైషాను అభినందిస్తున్న జగన్

బ్యాడ్మింటన్ రన్నరప్‌గా నవ్య

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): కోటక్ ఇండియా జూనియర్ ఇంటర్నేషనల్ సిరీస్ మహిళల సింగిల్స్‌లో హైదరాబాద్ అమ్మాయి కె.నవ్య రన్నరప్‌గా నిలిచింది. గచ్చిబౌలిలోని గోపీచంద్ అకాడమీలో జరిగిన ఈ పోటీల ఫైనల్స్‌లో నవ్య 14-21, 19-21తో తలిత రామధాని చేతిలో పోరాడి ఓడింది. స్టార్ షట్లర్లు శ్రీకాంత్, చిరాగ్, నవ్యకు ట్రోఫీ ప్రదానం చేశారు.



నవ్య





ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | హరిబాబు : 99854 11086, పున్నారావు: 9985921366